కూరగాయల సాగుపై రైతన్న ఆసక్తి

- పేట మండలంలో 600 హెక్టార్లలో సాగు
- ఏటా పెరుగుతున్న సాగువిస్తీర్ణం
- హైబ్రిడ్ రకాలతో దిగుబడులు

జగ్గయ్యపేట: మారుతున్న వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా దీర్ఘకాలిక పంటలైన వరి, పత్తి, మిర్చిపంటలతోపాటు కూరగాయల సాగుపై కూడా రైతులు దృష్టిసారిస్తున్నారు.

కూరగాయాల సాగుపై స్వల్ప కాలంలోనే ఆదాయం వస్తుండటంతో అధికశాతం మంది రైతులు ఈసాగుపై ఆసక్తి చూపుతున్నారు. జగ్గయ్యపేట మండలంలోని కె.అగ్రహారం, అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట, తక్కెళ్లపాడు గ్రామాల్లో వాతావరణ పరిస్థితులు, భూముల అనుకూలంగా ఉండటంతో కూరగాయల సాగు ఏటా విస్తరిస్తోంది. ఈ గ్రామాల్లో దాదాపు 600 హెక్టార్లలో దొండ, బెండ, వంగ, పచ్చిమిర్చి, బీరకాయ, కాకర, పొట్లకాయ, టమోట, మునగ, కాలీఫ్లవర్‌ల తోపాటు ఆకు కూరలు పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో కూరగాయల సాగు చేస్తుండటంతో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కూడా తోటల్లోకి వచ్చి తాజా కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. ఈ పంటలు స్వల్ప కాలంలోనే చేతికొస్తుండటంతో రైతులు కూడా ఆసక్తిగా సాగు చేపడుతున్నారు. ఎకరం నుంచి ఐదెకరాల వరకు రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. ఎకరానికి వివిధ రకాల కూరగాయల పంట 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. అంతేకాకుండా ప్రత్యేకమైన పందిళ్లు ఏర్పాటు చేసి మరీ సాగు చేస్తున్నారు. నిత్యం ఇంటిల్లిపాది కాయకూరల తోటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

హైబ్రిడ్ విత్తనాలతో దిగుబడులు..

హైబ్రిడ్ విత్తనాలనే రైతులు ఎక్కువగా వినియోగిస్తూ దిగుబడులు సాధిస్తున్నారు. ఈ విత్తనాలను ప్రత్యేకంగా ఇతర జిల్లాల నుంచి కూడా తీసుకు



కె.అగ్రహారంలో సాగవుతున్న తీగ దొండ

వచ్చి పంటలు సాగు చేస్తున్నారు. హైబ్రిడ్ విత్తనాలతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

దళారుల చేతివాటం..

ఈ ప్రాంతంలోని జగ్గయ్యపేటలో రైతు బజార్ ఉన్నప్పటికీ దళారుల చేతిలో తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఒక్కోసారి గిట్టుబాటు ధర రాక నష్టపోతున్నామని వారు వాపోతున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి ప్రక్కన ఉన్న గ్రామాలైన షేర్‌మహ్మద్‌పేట, అనుమంచిపల్లి గ్రామాల రైతులు కూరగాయలను తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు పంపుతున్నారు. అక్కడ కూడా ఓ రోజు మంచిధర లభిస్తే.. మరసటిరోజు నష్టాన్నే చవిచూడాల్సి వస్తోందని, చేసేది లేక అయినకాడికే అమ్ముకుంటున్నామని రైతులు చెబుతున్నారు.

పట్టించుకోని ఉద్యానవనశాఖ అధికారులు..

కూరగాయ సాగు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఉద్యానవనశాఖ ఉన్నప్పటికీ వారి పర్యవేక్షణ కొరవడుతుంది. దీంతో రైతులు పంటకొచ్చే తెగుళ్లను నివారించలేక నానా కష్టాలు పడుతున్నారు. కనీసం ప్రభుత్వం ఇచ్చే రాయితీలపై కూడా రైతులకు అవగాహన లేకుండాపోయింది. అంతే కాకుండా ఈప్రాంతంలోని కృషి వ్యవసాయ



అనుమంచిపల్లిలో సాగవుతున్న మునగ

పరిశోధనా కేంద్రం(కేవీకే) ఉన్నప్పటికీ కూరగాయల రైతులకు ఎటువంటి అవగాహన కలిగించడం లేదని కూరగాయలసాగు రైతులు అంటున్నారు. ఏడాదిలో ఓసారి అలావచ్చి వచ్చిపోతుంటారని, తద్వారా తమకు ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఉద్యానవనశాఖ, కేవీకే అధికారులు స్పందించి ఉద్యానవన పంటలసాగులో మెలకువలపై తమకు అవగాహన కల్పించాలని కూరగాయల సాగు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం సహకరించాలి...



పండించిన పంటను దళారులకు అయినకాడికి అమ్ముకుని నష్టపోతున్నాం. పండించిన కూరగాయలు రైతులు నేరుగా అమ్ముకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. దీంతో శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం.

–పోలినేడి రవి, అనుమంచిపల్లి, కూరగాయ రైతు

కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

జేసీ నిధీమీనా

వత్సవాయి: వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ నిధీమీనా ఆదేశించారు. కంప్యూటరీకరణ ప్రక్రియలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఉన్న వత్సవాయి సొసైటీని బుధవారం జేసీ పరిశీలించారు. అనంతరం జేసీ నిధీమీనా, సొసైటీ సిబ్బందితో మాట్లాడి కంప్యూటరీకరణ వివరాలు తెలుసుకున్నారు. సొసైటీలోని ప్రతి రైతు వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేసి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో చిన్నచిన్న లోపాలు ఉంటే వాటిని సరిద్దికుని ముందుకు వెళ్లాలన్నారు. ముఖ్యంగా సర్వర్ సమస్య వస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, సమస్యను పరిష్కరిస్తామన్నారు. వత్సవాయి సొసైటీ సిబ్బంది పనితీరును అభినందించారు. అనంతరం మక్కపేటలోని పంట నమోదు ప్రక్రియను జేసీ పరిశీలించారు. ప్రతి ఒక్క రైతు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగితే నష్టపరిహారం అందాలంటే ఖచ్చితంగా పంట నమోదై ఉండాలని స్పష్టం చేశారు. కౌలురైతు కార్డులు కూడా నిర్దేశిత సమయంలో వారికి అందేటట్లు చూడాలని సిబ్బందిని ఆదేశించారు. జేసీ



వత్సవాయిలో కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న జేసీ నిధీమీనా



మక్కపేటలో పంట నమోదును ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ

వెంట జిల్లా సహకార ఆడిట్ అధికారి సీహెచ్ శైలజ, డీఆర్‌పీ పి.కిరణ్‌కుమార్, తహసీల్దార్ నరసింహరావు, ఏవో వి.రవికుమార్, సొసైటీ కార్యదర్శి సామినేని హరికృష్ణ ఉన్నారు.

అనుమతిలేని ప్లాట్లు కొనవద్దు : కమిషనర్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణపరిధిలో అనుమతిలేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి నష్టపోవద్దని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు ప్రజలకు సూచించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అన్నిరకాల అనుమతులు ఉన్నదీ లేనిదీ ముందుగా పరిశీలించిన మీదటే స్థలాలు కొనుగోలు చేయాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం తోపాటు ఆయా శాఖల అనుమతిలేని లేఅవుట్లలో భవన నిర్మాణాలను అనుమతులు మంజూరు చేయబోమన్నారు. అనుమతిలేని లేఅవుట్లకు సంబంధించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనధికార లేఅవుట్లలో ఏర్పాటు చేసిన బౌండరీలు, లేఅవుట్లను తొలగించాల్సిందిగా పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్లు కమిషనర్ వివరించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దాత అందించిన ప్లేట్‌లు, గ్లాసులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. విద్యార్థులు కూడా చదువులో ప్రతిభచూపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాజు బాధ్యతల స్వీకారం



వత్సవాయి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న భరత్‌రాజు బదిలీకావడంతో ఆస్థానంలో రాజు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎంపీపీ కొలుసు రమాదేవి, ఈవోపీఆర్డీ మాధవి, సిబ్బంది ఎంపీడీవో రాజును శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

హాజరుశాతం పెరిగేలా చూడాలని ఆదేశం



నందిగామ టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి ఆదేశించారు. మండలంలోని కంచల గ్రామంలోని అంగనవాడీ కేంద్రాలు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా చూడాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పథకంపై ఉపాధ్యాయులు పర్యవేక్షణ ఉండాలని, విద్యార్థులకు సులభరీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం పథకం అమలుతీరు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీడీపీవో భాగ్యరేణుక, సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: సినీనటుడు చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా చిరంజీవి యువత జగ్గయ్యపేట నియోజకవర్గం అధ్యక్షుడు వల్లపునేని గోవిందరావు ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు బుధవారం డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పసుపులేటి సత్యశ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ నూకల సాంబ, మాజీ కోఆప్షన్ సభ్యుడు చౌడవరపు జగదీష్ పాల్గొని చిన్నారులకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. శ్రేయస్సు ప్రాజెక్టు వారి లెప్రా సొసైటీలో అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారుల సహాయార్థం చౌడవరపు జగదీష్ రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణా జిల్లా సంయుక్త కార్యదర్శి ఈమని కిషోర్ కుమార్, రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మోసిన్‌అహ్మద్, జగ్గయ్యపేట టౌన్ అధ్యక్షుడు జక్కంపూడి మల్లికార్జున్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సూరం సుధీర్, పట్టణ ఉపాధ్యక్షుడు వేముల నరసింహారాజు, పట్టణ సంయుక్త కార్యదర్శి హరివంశీ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అరవింద్‌కుమార్, జనసేన నాయకులు వెంకటాద్రి, పెండ్యాల శ్యామ్, సుభాకర్, హరీష్, గోపి, గౌతమ్ పాల్గొన్నారు.

వర్గీకరణ రద్దు కోరుతూ వినతి

జగ్గయ్యపేట అర్బన్: ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌లను రద్దు చేయాలని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎలక్షన్ డీటీ యు.కిషోర్‌బాబుకు బుధవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు, న్యాయవాది సంతోష్‌కుమార్, లంకపల్లి రవి తదితరులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌తో ఎంతోమంది నిరుపేద మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. తద్వారా వారు అభివృద్ధికి దూరమవుతారన్నారు. ప్రభుత్వాలు, న్యాయస్థానాలు పునరాలోచన చేసి వెంటనే ఎస్సీ వర్గీకరణను, క్రిమిలేయర్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీటీకి వినతిపత్రం అందజేసినవారిలో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు



డీటీ కిషోర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

యండ్రపల్లి లాజరు, కొచ్చెర్ల లక్ష్మడు, గేరపాటి వెంకన్న, ప్రశాంత్, పేరం సూరిబాబు, ముత్యాల షటారి, దుర్గాప్రసాద్, బూరుగు రామారావు, నవ్వుల రాజా ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గౌరవరం(జగ్గయ్యపేట): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ సిబ్బంది సక్రమంగా అందించాలని ఎంపీడీవో రమేష్‌బాబు ఆదేశించారు. మండలంలోని గౌరవరం అంగనవాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను కార్యకర్తలు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా పౌష్టికాహారంతో కలిగే కలిగే ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం ఆయన



అంగనవాడీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌బాబు

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఎంపీడీవో వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గ్రావెల్ అక్రమరవాణాపై ఆందోళన

నందిగామ టౌన్: అధికార టీడీపీ నాయకులు, కాంట్రాక్టర్లు, కొందరు ప్రైవేట్ వ్యక్తులు కలిసి అధికారులతో కుమ్మక్కై గ్రావెల్ అక్రమరవాణా చేస్తూ కోట్లు కొల్లగొడుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రాఘవాపురం, పల్లగిరిగట్టు వద్ద బుధవారం నిరసన వ్యక్తంచేసి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. అనంతరం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణం పేరుతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల్లో గ్రావెల్ తరలుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయ నాయకుల ప్రోద్బలంతో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రకృతి సంపద పక్కదారి పడుతోందని మండిపడ్డారు. ఇప్పటికే సుమారు రూ. ఐదు కోట్లకు పైగా విలువ చేసే గ్రావెల్‌ను జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మాణానికి వినియోగించగా, సంబంధిత అధికారులు కూడా మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరి



పల్లగిరి గట్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

స్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే మంత్రులు, జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లటంతోపాటు ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, సీపీఐ నాయకులు గోవిందరాజులు, మన్నే హనుమంతరావు, పొలినేడి నాగభూషణం, షేక్ ఖాశీం, కట్టా శ్రీకాంత్, కంభంపల్లి గిరి తదితరులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలని డిమాండ్

కంచికచర్ల: కలకత్తాలో ట్రైనీ డాక్టర్ మౌమితపై అత్యాచారానికి పాల్పడిన దోషులను శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్, జిల్లా మహిళా విభాగం కన్వీనర్ షేక్ జాహిదా డిమాండ్ చేశారు. అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట బుధవారం నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ, మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తెచ్చినా వాటి అమలులో విఫలమవుతున్నాయని విమర్శించారు. డాక్టర్ మౌమిత ఘటన కారకులైన వారిని శిక్షించడంతోపాటు మహిళలకు పటిష్టమైన భద్రత కల్పించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వరలక్ష్మి, దీపికా, మౌనిక, తులసి, వీరబాబు, వెంకటేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో కొవ్వొత్తుల ర్యాలీ

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్యా ఘాతుకానికి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పెనుగంచిప్రోలు గ్రామంలో యువత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా యువత మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే వారికే రక్షణ కరువైందన్నారు. దోషులను తక్షణం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొవ్వొత్తుల ర్యాలీలో ఉపాధ్యాయుడు దైదా దానయ్య, దోసపాటి సంజు, దాసరి మోహన్, దోసపాటి సాగర్, చింత వెంకట్, నాగబాబు, గోపిచంద్, ప్రభాస్, దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: కలకత్తాలో ట్రైనింగ్ డాక్టర్‌పై అత్యాచారం చేసి ఆమె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కలకత్తాలో ట్రైనింగ్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ జగ్గయ్యపేట పట్టణంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల



కంచికచర్ల జూనియర్ కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోట కృష్ణ మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. మహిళా డాక్టర్లకు, సిబ్బందికి పటిష్టమైన భద్రత కల్పించాలని, వైద్యుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర వైద్యశాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. ఈ సంఘటన జరిగి దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర, బెంగాల్ రాష్ట్రప్రభుత్వాలు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ గౌసమియా, నాయకులు కోట రవికుమార్, రావెళ్ల శేషు, బాలు, ఆశ వర్కర్లు జి.రేణుక, సీహెచ్.జ్యోతి, టి.కల్పన, కె.బేబీరాణి, టి.మాధవి, ఎస్.శారద, మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, మదార్‌బీ, మున్సిపల్ కార్మికులు పారా ఎలకమ్మ పాల్గొన్నారు.

భద్రత కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వాలు ..

నందిగామ టౌన్: మహిళలకు భద్రత, రక్షణ కల్పించలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్ విమర్శించారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక గాంధీసెంటర్‌లో బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనతో యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైందన్నారు. వైద్య వృత్తిలో ఉన్న మహిళకే రక్షణ



పెనుగంచిప్రోలులో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తంచేస్తున్న యువత, విద్యార్థులు



పేటలో నిరసన వ్యక్తంచేస్తున్న సీఐటీయూ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు



నందిగామ గాంధీసెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

లేకపోతే సామాన్యుల పరిస్థితేంటని ఆయన ప్రశ్నించారు. ఘటనపై దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా పాలకులు కనీస చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపీ నాయక్, కొల్లి సరళ, యామిని, పద్మజ, ఆదిలక్ష్మి, నాగమణి, కవిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో విద్యార్థులకు ఉన్నతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ తెలిపారు. కళాశాల సీఎస్‌ఈ విభాగం విద్యార్థులు స్పెక్ట్రం క్లబ్ ఆధ్వర్యంలో చిత్రావూరు గ్రామంలో సామాజిక కార్యక్రమాలను చేపట్టారు. గ్రామాన్ని దత్తత తీసుకొని పలు చైతన్య సదస్సులను నిర్వహించనున్నారు. అందులో భాగంగా తొలి రోజు గ్రామంలోని పలు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రాంతాల్లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల కార్యదర్శి అమర్ సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సామాజిక బాధ్యత కలిగి ఉన్నప్పుడు సమాజంలో మంచి ఉన్నతిని సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్న ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన చెరుకురి జ్యోతికి 2017లో సత్యనారాయణకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. కొంత కాలంగా సత్యనారాయణ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను వేదింపులకు గురి చేయసాగాడు. ఈ విషయం అత్తకు చెప్పినా పట్టించుకోవడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

టెక్నాలజీ రంగాల్లో ఉపాధి అవకాశాలు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రస్తుత సమాజంలో టెక్నాలజీ రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందాలంటే నైపుణ్యాలు పెంపొందించుకోవాలని లింకెడిన్ ట్రైనర్ నిస్సీ తెప్పలి అన్నారు. ఎంజీరోడ్డులోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం ట్రెండింగ్ స్కిల్స్ ఎక్రాస్ డొమైన్స్ ఇన్ టెక్నాలజీ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న నిస్సీ విద్యార్థులకు లింకెడిన్ ప్రొఫైల్స్ క్రియేట్ చేయించి, ప్రీమియమ్ సబ్‌స్క్రిప్షన్స్‌ను ఆరు నెలల వరకూ ఉచితంగా వినియోగించే అవకాశాన్ని కల్పించారు. దీని ద్వారా విద్యార్థులు ఎన్నో ఆన్‌లైన్ సర్టిఫికేషన్స్ చేసుకుని వారి ప్రొఫైల్‌ను, బయోడెటాను అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, ప్లేస్‌మెంట్ అధికారి పి.హారిక, కంప్యూటర్ విభాగాధిపతి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో లింకెడిన్ ప్రొఫైల్స్ క్రియేట్ చేయిస్తున్న నిస్సీ, ఇతర అధ్యాపకులు

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. గొల్లపాలెం గట్టు ప్రాంతానికి చెందిన అవనిగడ్డ లక్ష్మి, దుర్గారావు (64) భార్యాభర్తలు. దుర్గారావు చిన్న చిన్న పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఆరు నెలల కిందట ఇంట్లో గొడవ పడి బయటకు వెళ్లిన దుర్గారావు ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.